ప్రభుత్వ వ్యయం పెరుగుదలకు కారణాలు

ఆర్థికవృద్ధి, ప్రభుత్వ వ్యయ సంబంధ నేపథ్యంలో ప్రభుత్వ రంగ పరిమాణం అనే అంశం పరిశోధకులకు చర్చనీయాంశమైంది. పన్ను తీవ్రత, వ్యయం, వనరుల పంపిణీలో సమర్థత, ఉత్పాదితాల కల్పనరేటు లాంటి అంశాల ద్వారా ప్రభుత్వ పరిమాణం (Size of the government) దేశ ఆర్థికవృద్ధిని ప్రభావితం చేస్తుందని ఆర్థిక వేత్తలు ఆశించారు. ఉత్పాదక కార్యకలాపాలపై పెట్టుబడి ధనాత్మక వృద్ధిని ప్రోత్సహిస్తుందని ఆర్థికవేత్తల భావన. ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు ప్రభుత్వ వ్యయం ముఖ్య విధాన సాధనంగా ఉపకరిస్తుందని ఆధునిక అర్థశాస్త్ర పితామహుడు కీన్స్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక కార్యకలాపాల్లో ప్రభుత్వం అతిగా జోక్యం చేసుకోవడం ఆర్థిక ప్రగతిపై రుణాత్మక ప్రభావం చూపిస్తుందని మరి కొంతమంది ఆర్థికవేత్తల అభిప్రాయం.

స్వాతంత్ర్యానికి పూర్వం

స్వాతంత్ర్యానికి పూర్వం ప్రభుత్వ కార్యకలాపాలను సంప్రదాయ సిద్ధాంతకుల ఆలోచనా ధోరణి ఎక్కువగా ప్రభావితం చేసింది. ప్రభుత్వం అనేక కార్యకలాపాల్ని నిర్వహించడాన్ని సంప్రదాయ సిద్ధాంతకులు వ్యతిరేకించారు. ప్రభుత్వ కార్యకలాపాలు అనుత్పాదకంగా ఉంటాయని, ఉత్తమంగా భావించే ఏ ప్రభుత్వమైనా తన వ్యయాన్ని కుదించుకోవాలని వారు అభిప్రాయపడ్డారు. విదేశీ పాలకులు తమ వలస విధానంలో భాగంగా ఈ దృక్పథాన్ని మన దేశంలో అవలంభించారు.

స్వాతంత్ర్యానంతరం

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ కార్యకలాపాలు విపరీతంగా పెరిగాయి. స్వాతంత్ర్యం లభించిన నాటి నుంచి నేటి వరకు రక్షణ రంగంపై ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపించింది. చైనాతో భారత్ సరిహద్దు వివాదం కారణంగా 1962 తర్వాత రక్షణ రంగాన్ని, అంతర్గత రక్షణ వ్యవస్థను పటిష్టపరచాల్సిన బాధ్యత పెరిగింది. స్వాతంత్ర్యానికి ముందు మౌలిక సౌకర్యాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించలేదు. తమ వలస విధానంలో భాగంగా బ్రిటిష్‌వారు రైల్వేలు, రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ చూపించారు. కాల్వల ద్వారా నీటి పారుదల నిర్లక్ష్యానికి గురైంది. మౌలిక సౌకర్యాల అభివృద్ధి పంచవర్ష ప్రణాళికల్లో అంతర్భాగమైంది. ఆర్థికాభివృద్ధికి మూలమైన విద్యుచ్ఛక్తి, ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. మౌలిక సౌక ర్యాల కల్పనతో పాటు మౌలిక పరిశ్రమలను కూడా ప్రభుత్వం చేపట్టింది. రవాణా, సమాచార రంగాల అభివృద్ధిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. చౌకధరల్లో నిత్యావసర వస్తువుల సరఫరాకు ప్రజాపంపిణీ వ్యవస్థను చేపట్టింది. ఎగుమతుల ప్రోత్సాహంతో పాటు స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, మినరల్, మెటల్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ వ్యయం పెరుగుదలకు కారణాలు:

1. జనాభావృద్ధి: స్వాతంత్ర్యానంతరం దేశంలో జనాభా విస్ఫోటనం సంభవించింది. 1951లో దేశ జనాభా 36 కోట్లు కాగా 2001 నాటికి 102.7 కోట్లకు పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదల తప్పనిసరి. జనాభా పెరుగుదలతో పాటు పోలీస్, విద్య, ఆరోగ్య సౌకర్యాలపై కూడా వ్యయం పెరిగింది.

2. పట్టణీకరణ: స్వాతంత్ర్యానంతరం దేశంలో పట్టణ జనాభా పెరిగింది. 1951లో నగరాల్లో మొత్తం జనాభాలో 17.3 శాతం నివశిస్తే 2001 నాటికి వీరి సంఖ్య 27.8 శాతానికి పెరిగింది. ఏ దేశంలోనైనా పట్టణీకరణ ప్రక్రియ ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు కారణమవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలు, నగరాలకు వలసలు పెరుగుతున్నందున పోలీస్ యంత్రాంగాన్ని పటిష్టపరచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు గృహసౌకర్యాల పెంపుదల ఆవశ్యకత కూడా పెరిగింది. ఈ కార్యకలాపాలన్నీ ఎక్కువగా ప్రభుత్వ వ్యయంతో కూడుకొన్నవి.

3. స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల: ప్రభుత్వ వ్యయం పెరుగుదలతో పాటు అదే అనుపాతంలో స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల సంభవించలేదు. స్వాతంత్ర్యానంతరం స్థూల దేశీయోత్పత్తిలో పెరుగుదల 9 రెట్లు కాగా తలసరి ఆదాయంలో 3 రెట్లు మాత్రమే. సంప్రదాయ కార్యకలాపాల విస్తరణతో పాటు నూతన కార్యకలాపాలను కూడా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఏర్పడింది. ఒక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందినపుడు ప్రభుత్వ వ్యయం, జాతీయాదాయం ఒక స్థిర నిష్పత్తిలో పెరిగే దశకు ఆ ఆర్థికవ్యవస్థ చేరువవుతుంది. స్వాతంత్ర్యానంతరం స్థూలదేశీయోత్పత్తిలో ప్రభుత్వ వ్యయ నిష్పత్తిలో పెరుగుదల కనిపించింది.

4. రక్షణ వ్యయం: భారత్‌లో ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు రక్షణ వ్యయం కూడా కారణమైంది. గతంలో తృతీయ ప్రపంచ దేశాలు సైన్యంపై ఎక్కువగా శ్రద్ధ చూపించాయి. అంతర్గత రక్షణతో పాటు విదేశీ దురాక్రమణలు, దేశ రక్షణ కోసం మిలటరీ వ్యవస్థ పట్ల ఆయా ప్రభుత్వాలు శ్రద్ధ వహించడంతో ప్రభుత్వ వ్యయం పెరిగింది. 1980-81లో రక్షణ రంగంపై భారత ప్రభుత్వ వ్యయం రూ. 3,600 కోట్లు కాగా 2007-08 బడ్జెట్‌లో రూ. 96,000 కోట్లకు పెరిగింది. అమెరికా, బ్రిటన్‌తో పాటు మరికొన్ని దేశాలు మాత్రమే రక్షణ రంగంపై ఎక్కువ వ్యయం చేస్తున్నాయి.

5. అధికార యంత్రాంగం పెరుగుదల: అల్పాభివృద్ధి దేశాల్లో అధికార యంత్రాంగం నిర్వహణ అధిక వ్యయంతో కూడుకొన్నది. స్వాతంత్ర్యానంతరం అనేక విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విభాగాల్లో అధిక రిక్రూట్‌మెంట్ సాధారణ లక్షణంగా కన్పించింది. రాజా

చెల్లయ్య పరిశీలనలో ప్రభుత్వ విభాగాల్లో 20 నుంచి 25 మిగులు సిబ్బంది తేలారు. వ్యయ సంస్కరణల కమిషన్ 36 మంత్రిత్వ శాఖలను పరిశీలించింది. అనుమతించిన మొత్తం ఉద్యోగస్తులు 8,65,000 మందిలో 42,200 మంది మిగులుగా నిర్ధారించింది. గత కొంతకాలంగా వేతన స్కేళ్ల రివిజన్‌తో పాటు సాంవత్సరిక ప్రోత్సాహకాలు పెరిగినం దువల్ల పరిపాలన రంగానికి సంబంధించి ప్రభుత్వ వ్యయం పెరిగింది.

6. అభివృద్ధి ప్రాజెక్టులు: ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు అభివృద్ధి ప్రాజెక్టులపై అధిక పెట్టుబడులు కారణం. స్వాతంత్ర్యానంతరం వెనుకబడిన వ్యవస్థ నుంచి అభివృద్ధి చెందిన వ్యవస్థగా ఆర్థికరంగాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడింది. వెనుకబడిన ప్రాంతాలతో పాటు ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకొంది.

7. వడ్డీ చెల్లింపులు: ప్రభుత్వ రుణంపై వడ్డీని అనుత్పాదక వ్యయంగా పరిగణిస్తారు. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి కార్యకలాపాలతో పాటు సంక్షేమ కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టినందువల్ల ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం తనకు అవసరమైన వనరులను అంతర్గతంగా, బహిర్గతంగా రుణాల రూపంలో సమీకరించింది. మార్చి 2007 నాటికి మన దేశానికున్న బహిర్గత రుణం 169 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 1990-91లో వడ్డీ చెల్లింపుల రూపంలో రూ. 21496.25 కోట్లు వ్యయం చేయగా 2007-08లో ఈ వ్యయం రూ. 158994. 93 కోట్లకు చేరుకుంది.

8. సబ్సిడీలు: కొన్ని వస్తువుల అభిలషణీయ వినియోగం కోసం ప్రభుత్వం సబ్సిడీల రూపంలో వ్యయం చేస్తుంది. రక్షణ, సాధారణ పరిపాలన, లా అండ్ ఆర్డర్ నిర్వహణ లాంటి పబ్లిక్ వస్తు సేవలను ప్రజలకు ఎటువంటి ధర లేకుండా అందిస్తోంది. వీటితోపాటు మరి కొన్ని వస్తుసేవల ధరలకు సంబంధించి కొంత భారాన్ని ప్రభుత్వం తన వ్యయ రూపంలో భరిస్తుంది. అనేక వస్తు సేవలకు ధరలు విధించడంతో పాటు లక్ష్యిత వర్గాలకు అందించేవాటికి మాత్రమే సబ్సిడీ కల్పించినట్ల యితే ప్రభుత్వ వ్యయ భారం తగ్గుతుంది.

ప్రణాళికా యుగంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరగడానికి అభివృద్ధి, అభివృద్ధేతర వ్యయాలు ఎక్కువగా పెరగడమే కారణం. మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం 1990-91లో 41.37 శాతం. కానీ సంస్కరణల యుగంలో పరిమాణాత్మకంగా పెరిగినప్పటికీ అభివృద్ధి వ్యయం వాటా తగ్గింది. దీనికి కారణం ప్రభుత్వం కొన్ని కార్యకలాపాలకే పరిమితమై మిగతా విషయాల్లో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడమే.

ప్రణాళిక – ప్రణాళికేతర వ్యయం:

1987-88 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం అనే కొత్త వర్గీకరణను చేపట్టింది. ప్రణాళిక వ్యయంలో ప్రణాళికా సంబంధమైన వ్యయం చోటు చేసుకుంటుంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, వరద నియంత్రణ, పరిశ్రమలు, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణం, సాంఘిక సేవలు లాంటివి ప్రణాళికా వ్యయంలో ఉంటాయి.

వడ్డీ చెల్లింపులు, రక్షణ రెవెన్యూ వ్యయం, సబ్సిడీలు, పోస్టల్ లోటు, రైతుల రుణ విమోచన, పెన్షన్‌లు, పోలీస్‌పై వ్యయం, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు ప్రణాళికేతర వ్యయంలో ఉంటాయి. వీటిని రెవెన్యూ ఖాతాకు సంబంధించి ప్రణాళికేతర వ్యయంగా భావించవచ్చు. రక్షణ మూలధన వ్యయం, ప్రభుత్వరంగ సంస్థల రుణాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకిచ్చే రుణాలు, విదేశీ ప్రభుత్వాలకు రుణాలు లాంటివి మూలధన ప్రణాళికేతర వ్యయంలో ఉంటాయి.

ముఖ్యాంశాలు

- అత్యంత ఫలప్రదమైన అభివృద్ధి అంటే వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు సంతులిత వృద్ధిని సాధించడమే అని రాజా చెల్లయ్య అభిప్రాయపడ్డారు.
- పెరుగుతున్న ప్రభుత్వ వ్యయంలో రెవెన్యూ వ్యయం ఎక్కువ. రెవెన్యూ వ్యయంలో పెరుగుదల అంతా పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం ద్వారా సమకూరుతుంది.
- స్థూల దేశీయోత్పత్తిలో రెవెన్యూ వ్యయం 2007-08లో 11.9 శాతం.
- స్థూల దేశీయోత్పత్తిలో సబ్సిడీలపై వ్యయం 2007-08లో 1.1 శాతం.
- న్యాయ సమ్మతమైన అసమానతలను కొంతమేర సహించి, న్యాయ సమ్మతం కానటువంటి అసమానతలను తప్పనిసరిగా నివారించాలని చెప్పింది – ఆర్.ఎన్. త్రిపాఠి
- 1987-88 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం అనే కొత్త వర్గీకరణ చేపట్టింది.
- ప్రభుత్వ వ్యయాన్ని మూలధన వస్తు పరిశ్రమల అభివృద్ధికి వెచ్చిస్తే జాతీయాదాయంలో మూలధనం వాటా పెరిగి అసమానతలు పెరిగే అవకాశం ఉందని కె.ఆర్. రణదేవ్ అభిప్రాయపడ్డారు.
- పునఃపంపిణీ విత్తం తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అల్పాభివృద్ధి దేశాలకు అందిస్తున్నట్లుగా కన్పిస్తోందని చెప్పింది – డబ్ల్యు. డబ్ల్యు. హెల్లర్
- అభివృద్ధేతర వ్యయం పెరగడానికి రక్షణ వ్యయం, రుణ సేవలు, పరిపాలనపై వ్యయం ఎక్కువ అవడమే కారణం.
- ప్రపంచ బ్యాంక్ రుణ గ్రహీత దేశాలకు పరిపాలన వ్యయాన్ని స్థూల దేశీయోత్పత్తిలో 10 శాతం మేర తగ్గించమని సలహా ఇచ్చింది.
- రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి వ్యయం సామాజిక, కమ్యూనిటీ సేవలపై, ఆర్థిక సేవలపై వ్యయంగా ఉంటుంది.
- ప్రభుత్వం తన వ్యయాన్ని కుదించుకోవాలని సంప్రదాయ సిద్ధాంతకుల అభిప్రాయం.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, అభివృద్ధేతర వ్యయం (రూ. కోట్లలో)				
సంవత్సరం	అభివృద్ధి వ్యయం	అభివృద్ధేతర వ్యయం	మొత్తం వ్యయం	మొత్తం ప్రభుత్వ వ్యయంలో అభివృద్ధి వ్యయం (శాతంలో)
1990-91	345.65.79	48978.91	83544.7	41.37
2000-01	91884.12	199886.15	291770.27	31.49
2004-05	143010.08	280917.41	423927.49	33.73
2005-06	174951.89	295822.67	470774.56	37.16
2006-07 (బడ్జెట్ అంచనా)	223968.09	3188.98.55	542866.64	41.25
2007-08 (బడ్జెట్ అంచనా)	292651.70	350048.64	642700.34	45.53